భూ సమస్యలు పరిష్కరిస్తాం

అచ్చంపేట రూరల్: ధరణి పోర్టల్ రద్దయిన తర్వాత ప్రభుత్వం భూమాత పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానుందని, ఆ తర్వాత భూ సమస్యలు పరిష్కరిస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. 85 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నియంత పాలనను సాగనంపాక ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ప్రజావాణి ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాపాలనలో భాగంగా ప్రజలు దరఖాస్తు చేసుకుంటుండటంతో అధికారులు అక్కడ అందుబాటులో ఉన్నారన్నారు. మద్దిమడుగు, ఉడిమిళ్ల, ఇప్పలపల్లి, మారడుగు ప్రాంతాల్లో సెల్‌టవర్లను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. జనవరి 4న అచ్చంపేట మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అర్హులైన వారందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లను అందిస్తామన్నారు. అలాగే ఉప్పునుంతల మండలం తాడూరు రేషన్‌డీలర్‌పై గ్రామ యువకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అనంతరం ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే ఓ శాఖకు సంబంధించిన అధికారులతో రహస్యంగా భేటీ అయ్యారు. ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి, కౌన్సిలర్ గౌరీశంకర్, ప్రతాప్‌రెడ్డి, రాజేందర్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.


అచ్చంపేటలో దరఖాస్తు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

క్లుప్తంగా

నల్లమలవాసికి ఓయూ డాక్టరేట్


ఈశ్వర్‌లాల్

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతం లింగాలకు చెందిన కొర్ర ఈశ్వర్‌లాల్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టర్‌రేట్ పట్టాను పొందాడు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థిగా ఈశ్వర్ లాల్ 2017లో రిజిస్టర్ అయ్యారు. ఇంటర్నేషనల్ ఫేమ్ సీనియర్ ప్రొఫెసర్ ఏ.వి సతీష్ చంద్ర పర్యవేక్షణలో డిపార్ట్‌మెంట్ హెడ్ చంద్రునాయక్, బి.ఓ.ఎస్ ప్రొఫెసర్ శ్రీలత, సీనియర్ ప్రొఫెసర్ కృష్ణకుమార్, వెంకటేశ్వరులే పరిశోధన పత్రం సమర్పణలో సహకారం అందజేశారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పత్రాన్ని పొందారు.

రాష్ట్ర కార్యదర్శిగా వివేకానంద

కల్వకుర్తి రూరల్: సగర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్వకుర్తి పట్టణానికి చెందిన పడకంటి వివేకానంద ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వివేకానంద శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శిగా తనను ఎంపిక చేసిన రాష్ట్ర నాయకులకు జిల్లా కల్వకుర్తి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దుస్తుల పంపిణీ

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు ప్రభుత్వం శీతాకాలంలో అందించే స్వెటర్లు, టోపీలను సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సుదర్శన్ పంపిణీ చేశారు. శనివారం పట్టణంలోని రెండు వసతిగృహాల్లో వీటిని విద్యార్థులకు అందించారు. అదేవిధంగా జిల్లాలోని 29 వసతిగృహాలలోని విద్యార్థులకు వీటిని అందజేసినట్లు అధికారి సుదర్శన్ తెలిపారు. వసతిగృహ వార్డెన్ యాదయ్య, ఆయా వసతిగృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల సొమ్ము దుర్వినియోగం

మన్ననూర్: ప్రజల సొమ్ముతో సీఎం కాన్వాయ్ అంటూ ల్యాండ్ క్రూజర్ వాహనాలు ముందస్తుగానే కొనుగోలు చేస్తే తప్పేంటని మాజీ మంత్రి కడియం శ్రీహరి మాట్లాడటం దుర్మార్గం అని మండల కోఆప్షన్ సభ్యుడు రహీం అన్నారు. శనివారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనంత ప్రకటనలు(అడ్వర్టయిజ్‌మెంట్లు) విలాసాలకు ఖర్చు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారని విమర్శించారు. మహాలక్ష్మి పథకం పూర్తి స్థాయిలో అమలు కోసం అధికారంలోని వచ్చిన 22 రోజుల్లోనే ఆర్టీసీకి అదనంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు పిడికెడు బియ్యం

పెద్దకొత్తపల్లి: కల్వకోలులో చందు కాన్సెప్ట్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్క విద్యార్థి పిడికెడు బియ్యాన్ని తీసుకొచ్చి అనాథ పిల్లలకు అందజేయాలని పాఠశాల కరస్పాండెంట్ శేఖర్ విద్యార్థులకు సూచించగా.. శనివారం విద్యార్థులు 2.5 క్వింటాళ్ల బియ్యాన్ని తీసుకొచ్చి పాఠశాల యాజమాన్యానికి అప్పగించారు. కరస్పాండెంట్ శేఖర్ ఆ బియ్యాన్ని అనాథ పిల్లలకు అందజేస్తున్నట్లు తెలిపారు. హెడ్‌మాస్టర్ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీల్దార్‌తిప్ప చెరువు సాగునీరుకు పోరాటం..

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని ముక్కిడిగుండం, మొలచింతపల్లి గ్రామాలకు జీవనాధారమైన జీల్దార్ తిప్పచెరువుకు కేఎల్ఐ నుంచి సాగు నీరు వచ్చే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పాలక ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ ఫయాజ్ అన్నారు. శనివారం ఆయన సీపీఐ జెండాలను ముక్కిడిగుండం, మొలచింతపల్లి గ్రామాల్లో ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీల్దార్ తిప్ప చెరువుకు సాగునీరు తీసుకురావడంలో గత పాలకులు విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివుడు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా విగ్రహావిష్కరణ



అచ్చంపేట: మదర్ థెరిస్సా చేసిన సమాజ సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేట బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌరిశంకర్, సునీత, ప్రిన్సిపాల్ ప్రభుదేవ్‌రెడ్డి, జి.రాజేంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వీయ చిత్రపటం అందజేత
అచ్చంపేటకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కృష్ణ గీసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ స్వీయ చిత్రపటాన్ని శనివారం ఆయనకు అందజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు

ఉప్పునుంతల: ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాల, గువ్వలోనిపల్లి యూపీఎస్ తదితర పాఠశాలల్లో శనివారం 2024 నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంతోషం పంచుకున్నారు. 2023 సంవత్సరంలో పాఠశాలలో నిర్వహించుకున్న కార్యక్రమాలు, అదేవిధంగా విద్యా విధానంలో మార్పులను గుర్తు చేసుకున్నారు. హెచ్ఎంలు లక్ష్మీనారాయణ, సోమ్లానాయక్, ఉపాధ్యాయులు బాలమణి, శ్రీనివాసులు, వెంకటేష్, పద్మావతి, చైతన్య పాల్గొన్నారు.

సంచార వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి


గగ్గలపల్లిలో మందులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. వెంకటదాసు

నాగర్‌కర్నూల్ క్రైం: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వృద్ధులకు అందించే ఉచిత సంచార వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.వెంకటదాసు అన్నారు. మండల పరిధిలోని గగ్గలపల్లిలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్లాడారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత సంచార వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.రవికుమార్, రెడ్‌క్రాస్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, డి.కుమార్ పాల్గొన్నారు.

కల్వకోలులో హెల్త్ క్యాంపు..
పెద్దకొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచితంగా నిర్వహించే హెల్త్ క్యాంపులు ఉపయోగపడుతాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కల్వకోలులో సోషల్ వర్క్ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 300 మంది ప్రజలు హాజరై పరీక్షలు చేయించుకోగా.. 15 మంది సర్జరీకి ఎంపికయ్యారు. 30 మంది రక్తదానం చేశారు. 15 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, డాక్టర్ వినోద్, డాక్టర్ చిట్టి బాబు, డా. రోహిత్, ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ దివ్య అక్షతల ఊరేగింపు



పెద్దకొత్తపల్లి: కల్వకోలులో శనివారం రాత్రి అయోధ్య శ్రీరాముల వారి దివ్య అక్షతలను గ్రామస్తులు అయ్యప్ప ఆలయం నుంచి గ్రామంలోని పుర వీధుల వెంట ఊరేగింపు నిర్వహించి శ్రీరాముల దేవాలయంలో భద్రపరిచారు. శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్టు కల్వకోలు గ్రామస్తులు, బీజేపీ బజరంగ్ దళ్ నాయకులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షతల పంపిణీ..
కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో మండలంలోని వివిధ గ్రామాలకు అయోధ్య నుంచి పూజలు నిర్వహించి తీసుకొచ్చిన అక్షతలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వివేకానంద తదితరులతో పాటు వివిధ గ్రామాల నుంచి విశ్వహిందూ పరిషత్ సభ్యులు హాజరయ్యారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయ ప్రాంగణంలో శనివారం రాత్రి అవోపా 2024 క్యాలెండర్‌లను సంఘం అధ్యక్షుడు పాపిశెట్టి సతీష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. కార్యదర్శి శోభన్ బాబు, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు సుధాకర్, కృష్ణయ్య, గౌరయ్య, విజయభాస్కర్, రాజేందర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నీటి ట్యాంకర్‌తో పనులు

- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్


నీటి ట్యాంకర్‌తో పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్

అచ్చంపేట రూరల్: బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ పనులకు వినియోగించాల్సిన నీటి ట్యాంకర్‌ను పంచాయతీకి సంబంధం లేని వ్యక్తులు వాడుకోవడం దుమారం లేపుతుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామపంచాయతీకి చెందిన నీటి ట్యాంకర్‌ను గ్రామంలో సింగిల్‌విండో గోదాంను నిర్మిస్తున్న కాంట్రాక్టర్ ఎవరికీ సమాచారం ఇవ్వకుండానే వాడుకున్నారు. శనివారం గ్రామానికి చెందిన కొందరు గమనించి పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శికి కూడా సమాచారం ఇవ్వకుండా నీటి ట్యాంకర్‌ను తీసుకెళ్లి పనులకు ఉపయోగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అచ్చంపేట సింగిల్‌విండోకు చెందిన అధికారి, ప్రజాప్రతినిధి గోదాం నిర్మాణ పనులను చూసుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి భీముడును వివరణ కోరగా తమకేమీ సమాచారం ఇవ్వకుండానే నీటి ట్యాంకర్‌ను తీసుకెళ్లారని, గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో ట్యాంకర్‌ను తీసుకొచ్చామని తెలియజేశారు.

బీజేపీ నాయకుల నిరసన

కల్వకుర్తి రూరల్: అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని కాంగ్రెస్ పార్టీ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారని, ప్రస్తుతం దరఖాస్తుల పేరుతో కాలయాపన చేసేందుకు వ్యూహం రచించారని బీజేపీ నాయకులు ఆరోపించారు. సీఎం కల్వకుర్తి ప్రాంతవాసి అవ్వడం ఆనందంగా ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు ఇచ్చిన హామీలకు కొర్రీలు పెట్టే ప్రయత్నాన్ని బీజేపీ వ్యతిరేఖిస్తుందని కార్యవర్గ సభ్యులు దుర్గా ప్రసాద్ అన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్ఐడీ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాను ఆ సంఘ జిల్లా కార్యదర్శి తారాసింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తుందన్నారు.

ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



కొల్లాపూర్: ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్మన్‌బెట్ల గ్రామ మాజీ సర్పంచ్ మేకల నాగరాజు ఎన్నికయ్యారు. కొల్లాపూర్‌లోని కేఎల్ఐ అతిథి గృహంలో ముదిరాజ్ సంఘం నాయకులు సమావేశమయ్యారు. నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గిరింధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా నాగరాజును ఎనుకున్న సభ్యులు, మిగతా కమిటీని యధావిధంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన నాగరాజుకు శనివారం పలు ప్రజా సంఘాల నాయకులతో పాటు, ముదిరాజ్ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల చెంతకే ప్రజాపాలన


చర్లఇటిక్యాలలో దరఖాస్తులు తీసుకుంటున్న డిప్యూటీ తహసీల్దార్

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల్లో శనివారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ జలీల్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. మంచాలకట్టలో ఉదయం నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టి పలు సూచనలు చేశారు. తిరుపాటి నాగరాజు, విజయ్‌కుమార్, జమీల్, రామయ్య పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి, అజిలాపూర్ పూర్, కుందారంతండాల్లో మొత్తం 1,276 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, లక్ష్మమ్మ, అపర్ణ పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని బాణాల, గోదల్ గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం పథకం ఆరు గ్యారంటీలకు 926 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ సలిమోద్దిన్‌లు తెలిపారు. రేషన్‌కార్డుల కోసం 270 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

మన్ననూర్: తుర్కపల్లి, వెంకటేశ్వర్ల బావి, మాచారం గ్రామాల్లో అమ్రాబాద్ తహసీల్దార్ శ్రీకాంత్ గ్రామసభలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహణ తీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్‌లు కాశమ్మ, పెద్దిరాజు, పద్మ ఎంపీటీసీ పద్మ, డీటీ రవూఫ్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ కోటేశ్వర్ సూచించారు. వనపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుడిపల్లిలో 642 దరఖాస్తులు స్వీకరించారు.

తాడూరు: మండలంలో ప్రజాపాలన కొనసాగుతుంది. శనివారం సిర్సవాడ, చర్ల ఇటిక్యాల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

ఊర్కొండ: జకినాపల్లి, రాంరెడ్డిపల్లిలో 872 దరఖాస్తులు వచ్చినట్లు వెంకటేష్ చెప్పారు.

లింగాల: క్యాంపురాయవరం, రాయవరం, మగ్దూంపూర్, వల్లభాపూర్, కొత్తచెర్వుతండా గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగింది. మొత్తం 759 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

తెలకపల్లి: మండలంలో 2,143 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలియజేశారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలో 1,240 దరఖాస్తులు వచ్చినట్లుగా మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ తెలిపారు. ఆదివారం, సోమవారం కేంద్రాలకు సెలవు కావటంతో ప్రజలెవ్వరూ రావొద్దని, మంగళవారం నుంచి దరఖాస్తులు తిరిగి స్వీకరిస్తామని చెప్పారు.

గ్రామాల్లో దరఖాస్తుల కొరత



ఉప్పునుంతల: మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీల కోసం నిర్వహిస్తున్న గ్రామసభల్లో దరఖాస్తుల కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు సరిపడా దరఖాస్తులను అందుబాటులో ఉంచకపోవడంతో జిరాక్స్ సెంటర్ల వద్ద అధిక ధరలకు ధరఖాస్తులను కొనాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీం లీడర్లుగా ఉండాల్సిన మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో గ్రామ సభల వద్ద ఉండకపోవడంతో సమస్యలు వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజుల విరామం..
కల్వకుర్తిరూరల్: ప్రజాపాలనలో భాగంగా గ్రామాల్లో దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరిస్తున్నట్లు ఆర్డీఓ శ్రీనునాయక్ చెప్పారు. శనివారం మండలంలోని తాండ్ర, గుండూరు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాండ్రలో గ్రామస్తుల నుంచి ఆర్డీఓ శ్రీను దరఖాస్తులు స్వీకరించారు. కల్వకుర్తి మండలంలోని తాండ్ర గుండూరు గ్రామాల్లో మొత్తం 1,585 దరఖాస్తులు వచ్చాయన్నారు. గుండూరులో 715, తాండ్రలో 870 దరఖాస్తులు అందాయి. తహసీల్దార్ ఇబ్రహీం, సర్పంచ్ సుశీల, ఎంపీడీఓ అంజనేయులు, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

రాజీ మార్గంతోనే కేసుల పరిష్కారం

కల్వకుర్తి టౌన్: ఇరువర్గాల రాజీ మార్గంతోనే కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారమవుతాయని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా పలు కేసుల పరిష్కారాన్ని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కావ్యతో కలిసి నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో భాగంగా పలు బ్యాంకులకు సంబంధించిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కేసుల సమస్యలు పరిష్కరించారు. కోర్టు కేసులతో విలువైన సమయం వృథా అవుతుందని, మానసిక ఆందోళనలు పెరగుతూనే ఉంటాయని అన్నారు. ఇలాంటి లోక్ అదాలత్‌ల ద్వారా వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో భాగంగా 384 కేసులు పరిష్కారం కాగా.. 24 బ్యాంకు కేసులు, మార్నింగ్ కోర్టు కేసులు 170, జూనియర్, సీనియర్ సివిల్ కోర్టులో కలిపి 183 క్రిమినల్ కేసులు, 7 సివిల్ కేసులు పరిష్కరించామని కోర్టు అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చార్లెస్, లోక్‌అదాలత్ సభ్యుడు లక్ష్మణశర్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కల్వకుర్తి సీఐ ఆంజనేయులు, ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కల్వకుర్తిలో లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి

లోక్ అదాలత్‌లో 128 కేసులు పరిష్కారం..
కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మెజిస్ట్రేట్లు ఆర్‌వీఎస్ఎస్ మిధున్‌తేజ, జ్యోత్స్న గుంటి సమక్షంలో పలువురు కక్షిదారులు రాజీపడ్డారు. మొత్తం 128 కేసులు పరిష్కారమయ్యాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని కేసులు ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్లు మాట్లాడారు. కక్షిదారులు చిన్న సమస్యలకు సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం సరైంది కాదన్నారు. వీలైనంత వరకు సమస్యలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు వసంతరెడ్డి, కురుమూర్తి, మోహన్‌లాల్, నిరంజన్, ఫిరంగి గోవిందు, రామలక్ష్మమ్మ తదితరులున్నారు.

స్వయం ఉపాధికి శిక్షణ


శిక్షణ కోసం వచ్చిన నిరుద్యోగ యువతీ యువకులు

మన్ననూర్: ఐసీఐసీఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ కల్పించడం కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రజినీకాంత్ తెలిపారు. శనివారం అటవీశాఖ ఈసీ సెంటర్ ప్రాంగణంలో డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కోసం వచ్చిన నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు సంబంధించి పలు విషయాలను తెలియజేశారు. స్థానికంగానే ఉంటూ మోటార్ డ్రైవింగ్, కంప్యూటర్, హౌజ్ వైరింగ్, ప్లంబర్ పనుల్లో శిక్షణ, మెలకువలు తెలియజేసి సంస్థ ద్వార ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. మండలంలోని మాచారం, మొల్కమామిడి, బీకే తిర్మలాపూర్, బీకె ఉప్పునుంతల, జంగంరెడ్డి పల్లి, వటువర్లపల్లి గ్రామాలకు చెందిన 59 మంది నిరుద్యోగులైన యువతీ యువకులు పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కమ్యూనిటీ పెసిలిటేటర్ కృష్ణగంగ, అంతయ్య, డీఓలు లింగస్వామి, కనకరాజు, పీఎఫ్‌లు పాల్గొన్నారు.

నేడు గో వృషభ కల్యాణం

కందనూలు: ఆనంతశ్రీ గోశాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామ సమీపంలోని గోశాలలో నిర్వహించే గో వృషభ కల్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోశాల ట్రస్ట్ ప్రసిడెంట్ సౌజన్య దేశ్‌పాండే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఉదయం 9.30 నిమిషాలకు నిర్వహించేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. కార్యక్రమాన్నికి స్థానిక శాసనసభ్యుడు రాజేష్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

తాడూరు: పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో దొడ్డు గింజ వరి రకం జేజీఎల్ 24423 ఫౌండేషన్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ సాయిరమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిలో విత్తనాల ధర రూ. 44లు, విత్తనం కావాల్సిన వారు 8125438157 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అదే విధంగా డబ్ల్యూజీజీ 42 పెసర విత్తనాలు కిలో ధర.140, ఈ విత్తనాలు కావాల్సిన రైతులు 9912604549 నంబర్లను సంప్రదించి విత్తనాలను తీసుకోవచ్చని తెలియజేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



కొల్లాపూర్: పట్టణంలోని గోమతి గ్రామర్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఫైర్ స్టేషన్ అధికారి నర్సింగ్ రావు ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదాల నివారణతో పాటు, సీపీఆర్ విధానాన్ని కూడా వివరించారు. పాఠశాల నిర్వాహకులు ధనుంజయ్‌గౌడ్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

వెల్దండ: మండల పరిధిలోని గుండాలలోని అంబారామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని విఘ్నేశ్వరుడికి ఆధర్వణ శీర్షసూక్త పారాయణ, అభిషేకం, విశేష అలంకరణ, అష్టోత్తర శతనామార్చన తదితర కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. అర్చకులు, భక్తులు ఉన్నారు.

సీఎంను కలిసిన ఐక్యత చైర్మన్


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాఘవేందర్

వెల్దండ: మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, తదితర అంశాలపై వివరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను ఆయన కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వరప్రసాద్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అయ్యప్ప భక్తుల ఇరుముడి

లింగాల: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం సన్నిధానంలో శనివారం అయ్యప్ప మాల ధారణ స్వాముల ఇరుముడిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది స్వాములు, గురుస్వాములచే ఇరుముడి కట్టించుకున్నారు. ఇరుముడి ఎత్తుకున్న స్వాములు శబరిమలై యాత్రకు బయలుదేరి వెళ్లారు. దాతలు అన్నదానం చేశారు.

జిల్లా మైనార్టీ కార్యదర్శిగా తాహేర్

తాడూరు: జిల్లా మైనార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పాపగల్‌కి చెందిన తాహేర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా మైనార్టీ నేత అభి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలను వల్లపు రెడ్డి తెలిపారు. మైనారీల సంక్షేమమే ధ్యేయంగా గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని తాహేర్ అన్నారు.

పందులు చోరీ

ఊర్కొండ: మండలంలోని ముచర్లపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు 52 పందులు చోరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆంజనేయులు గ్రామ శివారులో పందుల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 52 పందులు చోరీ చేశారు. శుక్రవారం చుట్టుపక్కల పొలాల్లో వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.